క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ స్తంభాల మార్పిడి సందర్భంగా గురువారం సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి భవ్యాస్ తులసీవనం వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా యల్లమ్మబండ 11కేవీ ఫీడర్ పరిధిలోని 33/11 కేవీ శంషీగూడ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పంచమి కాలనీ, ఉజ్జయిని మహంకాళి నగర్, శంషీగూడ, ఖాజానగర్‌లలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా చిన్న చిత్తారమ్మతల్లి వార్షికోత్సవం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని బాలకృష్ణ నగర్ కాలనీలోని చిన్న చిత్తారమ్మ తల్లి 12వ వార్షికోత్సవ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, మల్లేష్ కుమార్, నర్సింగ్ సాయి, ప్రభు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను బహిష్కరించడం సిగ్గుచేటు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పిడమర్తి రవి బహిష్కరించడం సిగ్గుచేటు అని తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ బందారు వీరబాబు బుధవారం పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం మౌనంగా ఉంటూ కోట్ల రూపాయలను సంపాదించుకున్న ఆయన నేడు పదవులు లేకపోవడంతో సీఎం కేసీఆర్ పై విమర్శలు చేయడం దారుణమన్నారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే పిడమర్తి రవిని ప్రజలు సహించరన్నారు. నిజమైన ఉద్యమకారుడైతే పదవుల కోసం కాకుండా ప్రజల అభివృద్ధికి పని చేయాలన్నారు. సంపాదనకు మరిగి పదవుల కోసం వెంపర్లాడు పిడమర్తి రవికి త్వరలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వీరబాబు హెచ్చరించారు.

పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం

రసూల్‌పురా: నగరవాసులు ఎలక్ట్రిక్ వాహనాలను అధికంగా వినియోగిస్తున్నారని మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లిలో గ్రీన్‌హబ్ ఆటోమోటివ్స్ మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్ ఆటో షోరూంను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ సంస్థ సీఈవో సుకాంత్ జెనా మాట్లాడుతూ.. గ్రీన్‌హబ్ ఆటోమోటివ్స్ సంస్థ మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్ ఆటోను తెలంగాణలో ప్రవేశ పెడుతున్నామని వినియోగదారులు తమ పెట్టుబడిపై అధిక రాబడిని ఈ సూపర్ ఆటో ద్వారా పొందవచ్చన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అమ్మకాలు, విడిభాగాలు సర్వీస్ సేవలను అందజేస్తామని ఆటోమోటివ్స్ నగర డీలర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రి రాజశేఖర్‌రెడ్డి, తేజ పవన్ కుమార్, కిరణ్‌కుమార్ విద్యాధర్, పాత లక్ష్మణ్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

కూకట్‌పల్లి జెడ్‌సీ మమత



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ వి. మమత ఆధ్వర్యంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, కలెక్టర్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ ఉత్సవాలను ఆయా కార్పొరేటర్‌లతో కలుపుకొని అందరి అధికారుల కలిసి మెలసి సమన్వయంతో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ మల్లయ్య, ఏసీపీ చంద్రశేఖర్, ఎంఆర్‌ఓలు వాటర్‌వర్క్స్, ఇరిగేషన్, వెల్ఫేర్, హార్టికల్చర్ అండ్ ఫారెస్ట్, డీసీలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఉంది..

ఓల్డ్‌బోయిన్‌పల్లి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశానుసారం బుధవారం సాయంత్రం కార్పొరేటర్ నివాసంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ నాయకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను చేసుకోవాల్సిన తీరుతెన్నులను వివరించారు. జూన్ 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రోజు వారీగా చేసుకోవాల్సిన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం అందరికీ ఆదర్శంగా ఉండేలా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు సహకారం అందించాలని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకం అన్నీ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అభివృద్ధిని చూసి దేశ విదేశాల నాయకులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శి ఇర్ఫాన్, మేకల హరినాథ్, సీనియర్ నాయకులు నర్సింగ్ రావు, కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, ఖాదీర్, జహంగీర్, మట్టి శ్రీను, రాజుగౌడ్, పోచయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల వివరాలను కార్యకర్తలకు వివరిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

కేంద్ర ప్రభుత్వమే 20కిలోల బియ్యం ఇస్తోంది

• బీజేపీ నేత వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఇంటింటికీ బీజేపీ పాదయాత్రను బుధవారం అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, టీటీడీ బోర్డు మెంబర్, సీనియర్ బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో డివిజన్‌లో ప్రారంభించారు. అంజయ్యనగర్‌లోని శ్రీవీర అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ... మేము వెళ్లిన ప్రతి నుంచి రేషన్‌కార్డు లేదని, పింఛన్ రావడం లేదని, సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి తమకు అందడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు.

◆ తెల్లరేషన్‌కార్డు ఉన్న వారికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలసి 40కిలోల బియ్యం ఇచ్చేదన్నారు. ఇప్పుడు రాష్ట్రం ప్రభుత్వం చేతులు ఎత్తేయడంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే 20కిలోల బియ్యం అందిస్తోందని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దాచి పెట్టి వారే ఇస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యారావు, శ్రీకర్‌రావు, ఎనుగుల తిరుపతి, సంతోష్‌గౌడ్, రవికుమార్‌గౌడ్, సత్యమూర్తి, శరణ్, వేణుగోపాల్‌రెడ్డి, శంకర్, అమర్‌గౌడ్, మనోజ్‌యాదవ్, ప్రకాశ్, బల్వీర్‌సింగ్, అమర్నాథ్, భగత్, లక్ష్మి, తులసి వివిధ డివిజన్ల అధ్యక్షులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో జరిగిన పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

వార్డు కార్యాలయం సిద్ధం



బాలానగర్ డివిజన్‌లో సిద్ధమవుతున్న వార్డు కార్యాలయం

బాలానగర్: ప్రజల వద్దకే పాలన దిశగా బాలానగర్ డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. పాలనా వికేంద్రీకరణ ద్వారా పౌరులకు మరింత వేగంగా సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో వార్డు కార్యాలయాన్ని తీర్చిదిద్దుతున్నారు.

ప్రజలకు మేలు...

ప్రభుత్వం ఏర్పాటు చేసే వార్డు పాలనా వ్యవస్థతో ప్రజలు ఎంతో మేలు జరగనుంది. ప్రజలు తమ విన్నపాలు, సమస్యలు చెప్పుకోవడానికి సర్కిల్, జోనల్ కార్యాలయాలకు వెళ్లకుండా తమ దగ్గరలో ఉన్న వార్డు కార్యాలయంలోనే ఫిర్యాదులు, వినతులు అందజేయవచ్చు. ప్రజల సమస్యలు వేగంగా ప్రభుత్వ అధికారుల దృష్టికి వెళ్తాయి. దాంతో సమస్యలు త్వరితగతిన పరిష్కారం లభిస్తుంది. బాలానగర్‌లో సకల సదుపాయాలతో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

వార్డు ఆఫీస్‌లో ఎవరు ఉంటారు?

వార్డు కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్, బయోవర్సిటీ, హెల్త్ శానిటేషన్, వార్డు ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, విద్యుత్, జలమండలి విభాగాలకు చెందిన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తారు.

అనుమానాస్పదస్థితిలో స్విగ్గీ డెలివరీ బాయ్ మృతి

సనత్‌నగర్: హాస్టల్ గదిలో స్విగ్గీ డెలివరీ బాయ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన గోపాలన్ శ్రీనివాస్ (50) స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ భవానీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 28న విధులు ముగించుకుని హాస్టల్‌కు వచ్చిన గోపాలన్ శ్రీనివాస్ భోజనం చేసి గదిలోకి వెళ్లి బయటకు రాలేదు. మంగళవారం మధ్యాహ్నం నుంచి హాస్టల్‌లో దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు హాస్టల్ యజమానికి ఫిర్యాదు చేశారు. హాస్టల్ గదులన్నీ తనిఖీ చేయగా గోపాలన్ శ్రీనివాస్ గది నుంచి ఎక్కువగా దుర్వాసన రావడంతో లోపలికెళ్లి చూడగా బెడ్‌పై శవమై ఉండడం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే.. గోపాలన్ శ్రీనివాస్ గత కొంతకాలంగా హైబీపీ సమస్యతో బాధపడుతుండడంతో పాటు మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అందుకు సంబంధించిన చికిత్స పొందుతున్నట్లు గదిలో లభ్యమైన మెడికల్ రిపోర్టుల ద్వారా తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జైలు

సనత్‌నగర్: బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 47 మందిపై కేసులు నమోదవ్వగా 37 మందికి జరిమానా విధించారు. అలాగే మొదటిసారి పట్టుబడ్డ ఏడుగురితో పాటు రెండోసారి పట్టుబడ్డ మరో ముగ్గురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను విద్యార్థులు దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట పీహెచ్‌డీ ఫీజు తగ్గించాలని, హాస్టల్ వసతి, ఫెలోషిప్‌లు అందచేయాలని, డిగ్రీ కాలేజీలో రీసెర్చ్ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఆజాద్, నెల్లి సత్య, అఖిల్, మహేష్, గోవర్ధన్, మధు పాల్గొన్నారు.

శభాష్ సనిత

ప్రయాణికురాలిని కాపాడిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్



ప్రయాణికురాలిని కాపాడుతున్న సనిత సీసీ ఫుటేజీ

సనత్‌నగర్: కదులుతున్న రైలు ఎక్కబోయి ప్రమాదానికి గురైన ఓ ప్రయాణికురాలని ఆర్పీఫ్ కానిస్టేబుల్ సనిత కాపాడారు. విధినిర్వహణలో అత్యంత సమయస్ఫూర్తితో వ్యవహరించిన సనితను ఉన్నతాధికారులు అభినందించారు. మే 30వ తేదీన లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు వెళ్తున్న రైలు బేగంపేటకు చేరుకుంది. అక్కడి నుంచి రైలు తిరిగి బయలుదేరుతున్న సమయంలో ఒక ప్రయాణికురాలు కదులుతున్న రైలు ఎక్కేందుకు ప్రయత్నించారు. రైలు వేగం పుంజుకోవడంతో ఆ ప్రయాణికురాలు ప్లాట్ ఫారం, ట్రైన్ మధ్య గ్యాప్‌లో పడిపోయే పరిస్థితి నెలకొంది. ఇది గమనించిన కానిస్టేబుల్ సనిత ప్రయాణికురాలి చేతిని పట్టుకొని గట్టిగా లాగడంతో ఆమె బయట పడింది. ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు యూనిఫారంలో ఉన్న పౌరులుగా వ్యవహరిస్తూ 'మిషన్ జీవన రక్ష' కింద ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికులను కాపాడుతున్నారని ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు. నల్గొండ జిల్లాకు చెందిన కె.సనిత 2020లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ చేరారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

139కు సమాచారం ఇవ్వండి...

రైల్వే స్టేషన్‌లలో లేదా రైళ్లలో ఏవైనా ప్రమాదకర పరిస్థితులు కనిపించినప్పుడు ఆర్పీఫ్ సిబ్బందికి లేదా రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139కు సమాచారం అందజేయాలని కోరారు.

బాలాజీనగర్ డివిజన్ కాంగ్రెస్ నూతన కమిటీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు చౌదరి కృష్ణారాజ్‌పుత్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కాంగ్రెస్ కమిటీని బాలాజీనగర్ డివిజన్ ప్రగతి నగర్ కాలనీలో పీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం, తూము వేణు, బషీర్, అక్బర్ పటేల్‌ల చేతుల మీదుగా ప్రకటించారు. బాలాజీనగర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా ప్రకాష్ ముదిరాజ్, మైసయ్య, యాహియా ఖాన్, ఉదయ్‌కుమార్‌లు, జనరల్ సెక్రటరీలుగా నర్సింహాచారి, మొహమ్మద్ అక్బర్, శ్రీకాంత్ ముదిరాజ్, బాలరాజ్, అరుణ్, శివకుమార్‌లు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రాము, నరేష్, కిషన్, పోతన్న, లక్ష్మణ్‌గుప్తా, బెన్హర్, ఎండీ జహంగీలు, సెక్రటరీలు శివగౌడ్, శంకర్‌కుమార్, పవన్‌కుమార్, సాయికుమార్, లక్ష్మణ్‌లను ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడే కార్యకర్తలకే గుర్తింపు ఉంటుందన్నారు. అన్ని వర్గాలకి ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం

బల్కంపేట-సనత్‌నగర్ మార్గం విస్తరణలో కదలిక

కూల్చివేతలు చేపట్టిన అధికారులు

సనత్‌నగర్: దశాబ్ద కాలానికి పైగా సాగుతున్న ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద బల్కంపేట-సనత్‌నగర్ మార్గం ఎట్టకేలకు సుగమం చేసే దిశగా అధికారులు మరో అడుగు ముందుకువేశారు. బ్రిడ్జి కింద సబ్ వే విస్తరణకు అడ్డుగా ఉన్న ప్రైవేటు ఆస్తులకు సంబంధించి నష్టపరిహారం చెల్లించి వాటిని కూల్చివేసే ప్రక్రియలో కదలిక వచ్చింది. సబ్ వే విస్తరించేందుకు పదేళ్లుగా ప్రయత్నిస్తూ వస్తున్నారు. ఫతేనగర్ బ్రిడ్జి నిర్మాణం జరిగాక బ్రిడ్జి కింది నుంచి సనత్‌నగర్-బల్కంపేట మార్గంలో మాత్రమే రాకపోకలు సాగుతూ వస్తున్నాయి. మరోవైపు అంటే బల్కంపేట-సనత్‌నగర్ మార్గంలో ప్రైవేటు ఆస్తులు ఉండడం.. ఆస్తులు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లింపు విషయంలో తలెత్తిన వివాదం జాప్యానికి కారణమైందనే చెప్పాలి. అప్పట్లో మార్కెట్ ధర కన్నా రెండింతలు నష్టపరిహారం ఇస్తామని అధికారులు ప్రకటించినా అది సాధ్యం కాలేదు. ఆ తర్వాత టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) ప్రతిపాదనను తెరమీదకు తీసుకురాగా కొంత మంది మాత్రమే అంగీకరించారు. దీంతో సబ్ విస్తరణ గత కొన్నేళ్లుగా అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఈ క్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఇక్కడి భవన యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి టీడీఆర్ ప్రతిపాదనకు ఒప్పించడంతో బుధవారం కూల్చివేతల ప్రక్రియ ప్రారంభం అయింది.


జూలై 24, 25 తేదీల్లో 'ఎస్‌ఐడబ్ల్యూపీసీ' గ్లోబల్ సదస్సు

సనత్‌నగర్: సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ (ఎస్‌ఐడబ్ల్యూపీసీ) అంతర్జాతీయ సదస్సుకు నగరం వేదిక కానుంది. తెలంగాణ టూరిజం సహకారంతో తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో టీసీఈఐ ఎస్‌ఐడబ్ల్యూపీసీ గ్లోబల్-2023 పేరిట జరిగే ఈ సదస్సు జూలై 24, 25 తేదీల్లో హైటెక్స్‌లోని హెచ్‌ఐసీసీలో జరగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం బేగంపేటలోని హోటల్ హరితప్లాజాలో జరిగిన కార్యక్రమంలో సదస్సు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీసీఈఐ అధ్యక్షుడు బలరామ్‌బాబు మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు భారతీయ వివాహ పరిశ్రమలోని వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరవుతారన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలో అంతర్లీనంగా ఉండే విభిన్నమైన అంశాలకు సంబంధించిన లోతైన పరిజ్ఞానాన్ని ప్రపంచానికి అందించడంతో పాటు ఈవెంట్ రంగానికి చెందిన జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీసీఈఐ ప్రధాన కార్యదర్శి రవి బురా, శ్రవణ్ మాదిరాజులతో పాటు పలువురు వెడ్డింగ్ ప్లానింగ్ నిపుణులు పాల్గొన్నారు.

2 ట్రాఫిక్ ఠాణాలకు శ్రీకారం

● చిలకలగూడ, బోయిన్‌పల్లిలో ఏర్పాటు

● జూన్ 2న ప్రారంభానికి సన్నాహాలు



నూతన బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఏరియాలో నూతనంగా రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు రానున్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా నూతన స్టేషన్ల ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో కసరత్తులు పూర్తి చేశారు. జూన్ 2న ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ దిశగా పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ మేరకు ఆయా స్టేషన్లకు సిబ్బంది నియామకం పూర్తి చేశారు. ఇన్‌స్పెక్టర్ స్థాయిలో అధికారులు ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. కిందిస్థాయి సిబ్బంది నియామకాన్ని పూర్తి చేశారు. ఎస్.ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, కార్యాలయం సిబ్బంది నియామకాలను ఇప్పటికే చేపట్టినట్లు తెలిసింది. నూతన పోలీసు స్టేషన్ల ఏర్పాటు కోసం ట్రాఫిక్ పోలీసు అధికారులు ఆయా ఏరియాలను పరిశీలించి ఇందుకు సంబంధించి సరిహద్దులను కూడా ఖరారు చేశారు. జూన్ 2 నుంచి నూతన ట్రాఫిక్ పోలీసులు తమ తమ విధుల్లో నిమగ్నం కానున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విధుల సౌలభ్యం

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నివారించి వాహనచోదకులు సులువుగా రాకపోకలు సాగించే విధంగా నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు అంకురార్పణ జరిగింది. గతంతో పోల్చుకుంటే సికింద్రాబాద్‌లో విపరీతమైన ట్రాఫిక్ పెరిగిపోయింది. వేలాది వాహనాల రాకపోకలను నియంత్రించడం తలకు మించిన భారంగా మారింది. పాత స్టేషన్ల పరిధిని కుంచిస్తూ నూతన స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దీని వల్ల పోలీసు సిబ్బంది సునాయసంగా ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు వారిపై ఒత్తిడి కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

మారనున్న సరిహద్దులు..

సికింద్రాబాద్ ఏరియా పరిధిలోని పలు పోలీసు స్టేషన్ల ట్రాఫిక్ సరిహద్దులు మారనున్నాయి. పాత ఏరియాలు కొత్త స్టేషన్ల పరిధిలోకి రానున్నాయి. గోపాలపురం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని పద్మారావునగర్, ఈద్గామైదానం, అభినవనగర్ కాలనీ తదితర ప్రాంతాలు నూతన చిలకలగూడ పోలీసు స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. అదే విధంగా పాత తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ఏరియాలు నూతన బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోకి రానున్నాయి. నూతన చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోకి లా అండ్ పోలీస్‌స్టేషన్లు చిలకలగూడ, లాలాగూడ, వారాసిగూడ ఏరియాలు వస్తాయి. బోయిన్‌పల్లి నూతన ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోకి లా అండ్ ఆర్డర్ బోయిన్‌పల్లి పరిధితో పాటు కార్ఖానాలోని కొన్ని ఏరియాలు వచ్చి ఇందులో కలువనున్నాయి. నూతన బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను పాత బోయిన్‌పల్లి లా అండ్ ఆర్డర్ నుంచి కార్యకలాపాలు సాగుతాయి. పాత బోయిన్‌పల్లి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ నూతన భవనం నుంచి కార్యకలాపాలు సాగనున్నాయి.

ట్రాఫిక్ నియంత్రణ సులువు

సికింద్రాబాద్‌లో నూతన ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు కొంత వరకు తగ్గుముఖం పడుతాయి. ఏరియా పరిధిని కుంచించడం ద్వారా పోలీసు విధి నిర్వహణతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సులువవుతుంది. జూన్ 2న బోయిన్‌పల్లిలో నూతన ట్రాఫిక్ పోలీసుస్టేషన్, అదే విధంగా తార్నాక హుడా కాంప్లెక్స్‌లో చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తాం.


–గంగిరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ

దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌లో 'ఆవిర్భావ వేడుకలు'

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన దుబాయ్ సిటీ ఎగ్జిబిషన్‌లో రేపు తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాబ్‌సన్ బుజ్జి తెలిపారు. బుధవారం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల్లో తెలంగాణ స్ఫూర్తిని నింపేందుకు తమ వంతు బాధ్యతగా తెలంగాణ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ ఉత్సవాలు, బోనాల జాతర, పోతరాజుల విన్యాసం, తెలంగాణ ధూంధాం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమాలకు డా.ఇన్నారెడ్డి, ప్రజా గాయకుడు గద్దర్, బీఆర్‌ఎస్ నాయకులు మర్రి రాజశేఖర్‌రెడ్డి, పలువురు ఉద్యమకారులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌నూర్, సయ్యద్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల్లో బీజేపీకి ఆదరణ పెరుగుతోంది'

భాగ్యనగర్‌కాలనీ: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్ట సొసైటీలో రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాదయాత్రలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడ్డగుట్ట సొసైటీలో గత ప్రభుత్వ హయంలో ఎమ్మెల్యేగా పనిచేసిన భిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం పాడైన రోడ్లను, డ్రైనేజీలను కూడా కనీసం మరమ్మతు చర్యలు కూడా చేపట్టలేని స్థితిలో ఉందన్నారు. నిధులు లేక చాలా పనులు పెండింగ్‌లో పెడుతున్నారని తెలిపారు. ఎక్కువ ట్యాక్స్‌లు చెల్లిస్తున్న ఈ అడ్డగుట్ట సొసైటీ ఎందుకు అభివృద్ధి చెందలేదో స్థానిక ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. ఆయన సొంత వ్యాపారాలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలని తెలిపారు. రోజురోజుకి బీజేపీకి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోందన్నారు. ఎంతో మంది పార్టీలో చేరుతున్నారని వారందరిని కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాయల్ నందకుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అడ్డగుట్ట సొసైటీలో గడప గడపకు పాదయాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్